

# ఇదీ జీవితం

రీతిక

ఒకసారి నేను ఖమ్మం నుండి భద్రాచలానికి ఆర్.టి.సి. బస్సులో ప్రయాణం చేస్తున్నాను. బస్సొచ్చి ప్లాట్‌ఫామ్ మీద ఆగిన ఐదారు నిమిషాల్లోనే బస్సు ప్రయాణీకులతో క్రిక్కిరిసిపోయింది. నాతోబాటే ప్రయాణం చేస్తున్న నామిత్రుడొకడు నాకోసం ఓ సీటు రిజర్వ్ చెయ్యటం వల్ల నాకా బస్సులో సీటు దొరికింది.

## గుణపాఠం



బస్సొచ్చి ఆగిన అరగంట తర్వాత కండక్టర్, డ్రైవర్ వచ్చారు. ఉదయం ఎనిమిదింటికి కదలవలసిన బస్సు ఎనిమిదిన్నరకు కదిలింది. ప్రయాణీకులందరూ గొప్ప రిలీఫ్‌తో "హమ్మయ్య!" అనుకున్నారు.

అది సెమీలగ్జరీ బస్సు. మామూలు బస్సులో వుండే సీట్లు కంటె ఈ బస్సులో సీట్లు కొంచెం తక్కువుగా వుంటాయి. చాలా మంది ప్రయాణీకులు నిల్చొనే వున్నారు. బస్సు ఖమ్మం దాటేలోపలే కండక్టర్ చకచకా టిక్కెట్లు యివ్వటం పూర్తిచేసి కూర్చోవటానికి తన సీటు దగ్గర కొచ్చాడు. ఆ సీట్లో అంతకుముందే ఒక మధ్యవయస్కుడైన ప్రయాణీకుడు కూర్చొనే వున్నాడు. అయినా కండక్టర్ అక్కడకు రాగానే అతడు వెంటనే లేచినిల్చొని ఆసీటును కండక్టర్‌కిచ్చేస్తాడని మిగతా ప్రయాణీకులందరూ అను

నవీన్

కున్నారు. కానీ తెల్లషర్ట్, తెల్ల పైజామా వేసుకొని దర్జాగా యేదో మ్యాగజిన్ చదువుకుంటున్న ఆ ప్రయాణీకుడు కండక్టర్ అక్కడకు రావటం చూసి కూడా లేవకపోవటం అందర్నీ ఆశ్చర్యపరచింది. "యేమిటలా కూర్చున్నావు? ఇదేమన్న నీ తాతగారి సీటనుకున్నావా? లేకే "విసురుగా అన్నాడు కండక్టర్ తన సీట్లో కూర్చున్న ప్రయాణీకుడ్ని వుద్దేశించి.

"నా తాతగారి సీటు కాదు నిజమే... కానీ ఇది నీతాతగారి సీటు కూడా కాదు... అదిగో నీ తాతగారి సీటు అది...." అని ఆ ప్రయాణీకుడు డ్రైవర్‌కు ఎడమపక్కనే వున్న సింగిల్ సీటును చూపించాడు. ప్రయాణీకులందరూ ఆసీటు వైపు చూశారు. డ్రైవర్ పక్కనున్న ఆ సింగిల్ సీటు వెనక 'కండక్టర్' అని ఇంగ్లీషులో స్పష్టంగా రాసివుంది.

"అది కాదు నాసీటు.... నువ్వు కూర్చున్నదే నాసీటు. మర్యాదగానే కావాలంటే నువ్వే

వెళ్ళి ఆ సీట్లో కూర్చో" అన్నాడు కండక్టర్.

"నేనెక్కడకూ వెళ్ళను. ఈ సీట్లోనే కూర్చుంటాను. కండక్టర్ అని స్పష్టంగా రాసు న్నాక నేనెందుకు ఆ సీట్లో కూర్చోవాలి. కండక్టర్ పని చెయ్యాల్సిన ఖర్మ నాకేం పట్ట లేదు" అన్నడా ప్రయాణీకుడు.

"కండక్టర్ అని ఆసీటు మీద పొరపాటున రాశారు. కండక్టరెప్పుడూ డోర్ పక్కనున్న ఈ సీట్లోనే కూర్చుంటాడు. ఆ విషయం బస్సులెక్కే పసిపిల్లాళ్ళకు కూడా తెలుసు. నువ్వు వెంటనే ఆసీటు ఖాళీ చేస్తావా? లేదా? " అన్నాడు కండక్టర్.

"నేను ఈ సీటుమీదే కూర్చుంటాను. నువ్వేం చేసుకుంచటావో చేసుకో" అన్నాడు ప్రయాణీకుడు.

కండక్టర్ వెంటనే 'రంగ్' మని బస్సు సీలింగ్‌మీద కొట్టి "బస్సాపెయ్" అని అరిచాడు. డ్రైవర్ వెంటనే బస్సును ఆపేశాడు.

ప్రయాణీకులందరూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారే తప్ప ఎవరూ వెంటనే మాట్లాడలేకపోయారు.

"ఎవరో ఒకరు సర్దుకుపోవాలిగానీ బస్సును ఆపేస్తే ఎలా?" అన్నాడు సఫారీసూట్ వేసుకున్న ఓ పెద్దమనిషి రెండు నిమిషాల తర్వాత.

"మీరు వెళ్ళి ఆకండక్టర్ సీట్లో కూర్చొంది", అన్నాడు మరో పెద్దమనిషి తెల్లచొక్కా వేసుకున్న ప్రయాణీకుడ్ని ఉద్దేశిస్తూ.

"కండక్టర్ సీట్లో కారక్టర్ కూర్చోవాలి. నేనెందుకు కూర్చుంటానండి" అన్నాడా ప్రయాణీకుడు. అందరూ గొల్లున నవ్వారు.

"కండక్టర్ అని ఆసీటు వెనకాల రాసుంది కదండి. మీరే వెళ్ళి ఆసీట్లో కూర్చొండి" అన్నారు కొందరు ప్రయాణీకులు కండక్టర్‌తో.

"రాసున్నంత మాత్రాన కూర్చోవాలని యేమీలేదు. కండక్టరెప్పుడూ డోర్ పక్కమున్న సీట్లోనే కూర్చోవాలి. ఆయన లేవకపోతే బస్సును పోలీసు స్టేషన్‌కు తీసికెళ్తాను." అన్నాడు కండక్టర్.

"పోలీసు స్టేషన్‌కు తీసికెళ్ళండి. నేను రెడీ" అన్నాడు ప్రయాణీకుడు.

ఐదు నిమిషాలు... పదినిమిషాలు.... ఇరవై నిమిషాలు..... ఇలా నిమిషాలు దొర్లిపోతున్నాయి. కానీ బస్సుకదలదు.

ప్రయాణీకులందరూ యేమి చెయ్యాలో తెలియక దీర్ఘమైన నిట్టూర్పులు విడువసాగారు.

నేను సరిగ్గా కండక్టర్ కూర్చవాలనుకుంటున్న సీటు వెనకే కూర్చొని వున్నాను. నేనులేచి నాసీటును కండక్టర్ తనదని అంటున్న సీట్లో కూర్చున్న తెల్లచొక్కా ప్రయాణీకుడికిస్తే సమస్య పరిష్కారమౌతుందనే ఐడియా నాకొచ్చింది.

వెంటనే లేచి ఆ ప్రయాణీకుడ్ని ఉద్దేశిస్తూ "మీరొచ్చి నా సీట్లో కూర్చొండి. ప్లీజ్ నేను నిల్చుంటాను. బస్సును వెళ్ళనీయుండి" అన్నాను. నాతోపాటు ఇంకా కొందరు ప్రయాణీకులు బతిమాలాక చాలా అయిష్టంగా అతడొచ్చి నేను ఖాళీచేసిన సీటులో కూర్చున్నాను. అప్పుడుగానీ బస్సు కదిలింది. నేను నిల్చొనే ప్రయాణం చేశాను.

మూడు గంటలు ప్రయాణం చేశాక బస్సు కొత్తగూడెం చేరుకుంది. తెల్లచొక్కా ప్రయాణీకుడు కొత్తగూడెంలో దిగిపోవటానికి తన లగేజినంతా బస్సు కిందకు దింపుకున్నాడు. డ్రైవర్ కండక్టర్లు టీ తాగటం కోసం క్యాంటీన్‌కు వెళ్ళారు.

తెల్లచొక్కా ప్రయాణీకుడు వెళ్ళిపోతూ నావైపు తిరిగి "మీరు అనవసరంగా జోక్యం చేసుకున్నారు సార్! లేకపోతే వాడే జన్మలో మరచిపోలేని గుణపాఠం నేర్పించేవాడిని" అన్నాడు. అతని మాట విని నాలో నేను నవ్వుకున్నాను.

మరోగంట ప్రయాణం చేశాక బస్సు భద్రాచలం చేరుకుంది. నేను దిగిపోవటానికి సిద్ధమౌతుంటే కండక్టర్ నాకేసి తీక్షణంగా చూస్తూ "మీరనవసరంగా జోక్యం చేసుకున్నారు సార్! లేకపోతేనా వాడ్నీ రోజు పోలీసు స్టేషన్‌కు తీసికెళ్ళి లాకప్‌లో తోయించేవాడిని మీ ముఖం చూసి వూరుకున్నాను" అన్నాడు. ఈ సారి నాలో నేను నవ్వుకోలేకపోయాను. ✱




SKP

ఉషఃకిరణాల స్పర్శతో
విరబూయు కమలం
శ్రీకమలప్రియ సభ్యత్వంతో
వెలుగు సిరిశోభల మాజీవితం!

మేనేజింగ్ డైరెక్టర్:
Ch.వెంకటేశ్వర్లురెడ్డి